## ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

**సనత్‌నగర్:** టమాటా రూ.23, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 23, క్యాప్సికం 55, పచ్చకాకర 38, పందిరి బీర 40, క్యాబేజీ 18, క్యారెట్ 40, దొండ 15, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 31, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 24, చామగడ్డ 33, మొరంగడ్డ 19, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

## టేబుల్ టెన్నిస్ విజేతలకు బహుమతుల ప్రదానం



**లాలాపేట:** ద వెటరన్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జయశంకర్ ఇండోర్ స్టేడియంలో 2 రోజులుగా 3– తెలంగాణ స్టేట్ టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహిస్తున్నారు. 6 కేటగిరీల్లో గెలుపొందిన విజేతలకు ఐఎస్‌సీఎస్ చైర్మన్ నవీన్‌కుమార్, అసోసియేషన్ అధ్యక్షుడు దయాకర్ కుసుమ, ప్రధాన కార్యదర్శి విఠల్ భేతి ఆధ్వర్యంలో ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, దేవేంద్రనాథ్, రంగారావు, గోపీనాథ్ రావు, లలిత్ మోహన్, రామారావు, సురేశ్, రాజేంద్ర ప్రసాద్, హరికృష్ణ, పి. సురేశ్ తదితరులు ఉన్నారు.

## ఆలయ ఆవరణలో వన మహోత్సవం



మొక్కలు నాటుతున్న ధర్మకర్తలు

**సికింద్రాబాద్:** సీతాఫల్‌మండి డివిజన్ నామాల గుండులోని వీరాంజనేయ స్వామి ఆలయంలో ధర్మకర్తలు ఆదివారం వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో 100 మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కైలాష్ అరుణ్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

**బంజారాహిల్స్:** రానున్న బోనాల పండుగను పురస్కరించుకుని రౌడీషీటర్ల కదకలిలపై నిఘా ఉంటుందని, ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే ఊరుకునేది లేదని మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ రౌడీషీటర్లకు హెచ్చరికలు జారీ చేశారు. బోనాల పండుగ సందర్భంగా రౌడీషీటర్లను బైండోవర్ చేసిన అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. వివాదాల జోలికి వెళ్లవద్దని, ప్రశాంతంగా ఉండాలని, అనుమానాస్పదంగా తిరిగితే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతిరోజూ తమ పోలీసులు రౌడీషటర్ల కదలికలపై దృష్టిపెట్టారనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు.

## సేంద్రియ వ్యవసాయాన్ని కేంద్రం ప్రోత్సహించాలి

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** సేంద్రియ వ్యవసాయానికి కేంద్ర ప్రభుత్వం మరింత ప్రోత్సహించాలని కోరుతూ ఎన్విరాన్‌మెంట్ ప్రొటక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్‌సీహెచ్ రంగయ్య, జాతీయ సలహాదారుడు డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి జయంత్‌సింగ్‌కు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుత రసాయన వ్యవసాయం వల్ల భూసారం తగ్గి పంటల పోషక విలువలు పడిపోతుంటాయని, దీని వల్ల మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రతి కుటుంబాన్ని సేంద్రియ కుటుంబంలో భాగస్వామ్యం చేయాలని, శిక్షణ, రాయితీలు, విత్తనాలు, సహజ ఎరువుల తయారీకి మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సేంద్రియ ప్రకృతి మిషన్‌ను 100 శాతం రాయితీతో నడిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

## మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** వరంగల్‌లో ఈ నెల 29, 30వ తేదీల్లో నిర్వహించే తెలంగాణ ప్రజా ఫ్రంట్ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కడమంచి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడి 11 ఏళ్లు అవుతున్నా ప్రజల ఆశలు నెరవేరలేదన్నారు. అమరవీరుల త్యాగాలు నిష్ప్రయోజనంగా మారాయన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజల హక్కుల పరిరక్షణకు పోరాటాలే శరణ్యం అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆజాద్, ముత్తన్న, ఉప్పల సోమయ్య, ఎం.రాజు, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

# 5 డివిజన్లు.. 50 వేల మొక్కలు..!

### వన మహోత్సవానికి అధికారుల సన్నద్ధం



వన మహోత్సవం కోసం నర్సరీల్లో సిద్ధంగా ఉన్న మొక్కలు

**సికింద్రాబాద్:** వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ అధికారులు సన్నద్ధం అవుతున్నారు. సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని 5 డివిజన్లలో 50 వేల మొక్కలు నాటేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకోసం పార్కులు, కాలనీలు, ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల ఆవరణ స్థలాలను ఎంపిక చేశారు. డివిజన్ల వారీగా వన మహోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆయా ప్రాంత ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధుల సహకారం తీసుకునేందుకు కసరత్తు చేస్తున్నారు.

- లష్కర్‌లోని 2 నర్సరీల్లో మొక్కల పెంపకం
- ప్రజా పంపిణీకి 30 వేలు
- ప్రభుత్వ స్థలాల్లో నాటేవి 20 వేలు

#### 2 నర్సరీల్లో పెంపకం..

జీహెచ్‌ఎంసీ అధికారులు 2 సర్కిళ్ల పరిధిలో మొక్కలు నాటేలా సికింద్రాబాద్‌లో 2 నర్సరీలను ఏర్పాటు చేశారు. కొన్ని రకాల మొక్కలకు ఇక్కడే అంట్లు గట్టి పెంచడంతో పాటు, కొన్ని రకాల మొక్కలను ఇతర నర్సరీల నుంచి దిగుమతి చేసుకుని ఇక్కడ సంరక్షిస్తున్నారు. వెస్ట్‌మారేడుపల్లిలోని దిల్‌దార్ లేఅవుట్ నర్సరీ, జూబ్లీ బస్‌స్టేషన్ సమీపంలోని గార్డెన్ నర్సరీలో మొక్కలను సిద్ధంగా ఉంచారు. ఇంటి ముందు, ఆవరణలో ప్రజలు మొక్కలు నాటుకునేందుకు నిమ్మ, దానిమ్మ, కరివేపాకు, జామ, అల్ల నేరేడు మొక్కలు పంపిణీ చేయనున్నారు. ఇతర చోట్ల వేప, రావి, బాహూనియా, చింత, అల్ల నేరేడు, కానుగ, బాదం మొక్కలు నాటేలా కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. వర్షాలు ప్రారంభమై, రాష్ట్ర ప్రభుత్వం నుంచి వన మహోత్సవ కార్యక్రమాల టైం టేబుల్ ఖరారు అయ్యాక మొక్కల పంపిణీ ప్రారంభిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

#### ప్రభుత్వ స్థలాలపై ప్రత్యేక దృష్టి

సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో విశాలమైన మైదానాలు, పార్కులు లేవనే చెప్పాలి. దీంతో అధికారులు ప్రభుత్వ స్థలాలపై దృష్టి సారిస్తున్నారు. స్థానికంగా ఉన్న పార్కులు, శ్మశాన వాటికలు, విశాలమైన రహదారులకిరువైపులా, ప్రభుత్వ స్థలాల్లోనూ పెద్ద సంఖ్యలో మొక్కలు నాటనున్నారు. ఇందుకోసం రైల్వే స్థలాలు, ఉస్మానియా యూనివర్శిటీ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల స్థలాల్లో మొక్కలు నాటేలా కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు.

#### పంపిణీ తీరు..

సర్కిల్ పరిధిలోని 5 డివిజన్లలో అన్ని రకాల మొక్కలు కలిపి 50 వేల మొక్కలు నాటనున్నారు. డివిజన్‌కు 6 వేల మొక్కల చొప్పున పంపిణీ చేస్తారు. ఇందులో 3 వేలు చిన్న తరహా మొక్కలు, మరో 3 వేలు ఏపుగా పెరిగే మొక్కలు పంపిణీ చేయనున్నారు. 5 డివిజన్లకు కలిపి 30 వేల మొక్కలు పంపిణీ చేయగా, మరో 20 వేల మొక్కలు ఎంపిక చేసిన ప్రభుత్వ స్థలాల్లో నాటేలా ప్రణాళికలు రూపొందించారు.

| లష్కర్ వన మహోత్సవం తీరు | |
|---|---|
| నర్సరీలు 2: | మారేడుపల్లి, జేబీఎస్ |
| మొత్తం మొక్కలు: | 50 వేలు |
| ప్రజా పంపిణీ కోసం: | 30 వేలు |
| ప్రభుత్వ స్థలాల్లో నాటేవి: | 20 వేలు |
| పంపిణీకి మొక్కలు: | నిమ్మ, దానిమ్మ, కరివేప, గోరింట, జామ, అల్లనేరేడు |
| నాటే మొక్కలు: | వేప, రావి, బాహూనియా, చింత, కానుగ, బాదం |

#### సంరక్షణకూ చర్యలు..

సికింద్రాబాద్ ప్రాంతంలో ఏళ్ల క్రితం నాటిన చెట్లు మినహా గత ఐదారేళ్లలో నాటిన మొక్కలు లేవనే చెప్పాలి. ఏటా వన మహోత్సవాలు నిర్వహిస్తున్నా నాటిన మొక్కలను సంరక్షించేవారు లేకపోవడంతో అవి నాటిన కొద్ది రోజులకే చచ్చిపోతుండేవి. అయితే ఈసారి అలాకాకుండా సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. మొక్కలు పెరిగేందుకు అనువైన వాతావరణం గల స్థలాలు, సరిపోయే గుంతలు ఏర్పాటు చేయడం, నాటిన తర్వాత సంరక్షణకు వాటి చుట్టూ కంచెలు ఏర్పాటు చేయనున్నట్లు జీహెచ్‌ఎంసీ హార్టికల్చర్ అధికారులు చెబుతున్నారు.

## ‘అప్పుల్లో కూరుకుపోతున్న తెలంగాణ’



మాట్లాడుతున్న జత్తు హుస్సేన్ నాయక్

**సికింద్రాబాద్:** కష్టాలు, నష్టాల్లో ఉన్న బీహార్, యూపీ రాష్ట్రాలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తుండగా సంపన్న రాష్ట్రంగా ఉన్న తెలంగాణ మాత్రం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నదని నేషనల్ కమిషన్ షెడ్యూల్ ట్రైబ్స్ మెంబర్ ఏ. జాతు హుస్సేన్ నాయక్ అన్నారు. తెలంగాణ స్టేట్ యానాదిస్ (గిరిజన) వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెట్టుగూడ రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో యానాదుల ఆత్మగౌరవ సభ తదితర కార్యక్రమాలు ఆదివారం జరిగాయి. ముఖ్య అతిథులుగా ఐఏఎస్ అధికారి ఈ శ్రీధర్, గిరిజన అసోసియేషన్ చైర్మన్ ఈ ఆంజనేయులు, జాతీయ గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు పివి రమణతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ఉచిత పథకాలకు స్వస్తి పలికి మెరుగైన విద్య, వైద్యం అందించాలన్నారు. బడుగు బలహీన వర్గాలు, హరిజన గిరిజన తెగలకు చెందిన వారంతా తమ పిల్లలను ఉన్నత విద్యనందించడం ద్వారా సామాజిక ప్రగతి సాధించవచ్చని చెప్పారు. అనంతరం తెలంగాణ స్టేట్ యానాదిస్ (గిరిజన) వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ఈ ఆంజనేయులు, అధ్యక్షుడిగా సీహెచ్ రామచంద్రరావు, జనరల్ సెక్రటరీగా ఐ సాంబశివరావు, ట్రెజరర్‌గా జేసీ శేషాద్రిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాసులు, ఏడుకొండలు, పార్థసారథి, సీహెచ్ వెంకటేశ్వర్లు, శివ శంకర్ రావు, ప్రభాకర్ రావు, రామకృష్ణయ్య ఆర్ సురేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి జన్మదిన వేడుకలు



వారాసీగూడలో అన్నదానం చేస్తున్న నాయకులు

**సికింద్రాబాద్:** బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్లలో బీజేపీ నాయకులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు వారాసీగూడలో అన్నదానం చేపట్టారు. అలాగే జామైఉస్మానియా వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు.

### లాలాపేటలో రక్తదాన శిబిరం

**లాలాపేట:** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని లాలాపేటలోని ప్రొ. జయశంకర్ స్టేడియం వద్ద తార్నాక డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బండారి ఉపేందర్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రతిభా బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు శ్యామ్‌సుందర్ గౌడ్ హాజరై ప్రారంభించారు. అలాగే పలువురి రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డి, శ్యాంసుందర్, వెంకటేశ్ గౌడ్, పోచయ్య యాదవ్, భిక్షపతి, వీరన్న, సుబ్బారావు, ప్రకాశ్‌గౌడ్, సుక్క గణేశ్, మోహన్, రాము వర్మ, ఆకుల శ్రీనివాస్, కరుణాకర్, వేణు, అనిత, అనూష తదితరులు ఉన్నారు.

## ఓయూలో ముగిసిన జాతీయ సదస్సు



పురస్కారాలు అందుకున్న పాత్రికేయులు

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా, ఓయూ బీఈడీ కాలేజీ, ఆంధ్రామహిళా సభ విద్యాకళాశాల ఆధ్వర్యంలో ‘జాతీయ విద్యా విధానం -మీడియా పాత్ర’ అనే అంశంపై సదస్సు నిర్వహించగా ఇఫ్లూ వీసీ ప్రొ.నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన పాత్రికేయులకు పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డబ్ల్యూజేఐ జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ, రాష్ట్ర అధ్యక్షుడు రాణాప్రతాప్, ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కరుణాకర్, సీనియర్ జర్నలిస్ట్ వల్లీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ వార్డు స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్

**సికింద్రాబాద్:** అన్ని డివిజన్లలో బూత్‌స్థాయి కమిటీలతో పాటు అనుబంధ సంఘాల కమిటీలు నియమించాలని బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ సూచించారు. బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు సాయిప్రసాద్‌గౌడ్ నేతృత్వంలో ఆదివారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన హాజరై మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఇంటింటికీ తిరుగుతూ వివరించాలన్నారు. ఇందుకోసం సత్వరమే కమిటీలు నియమించి వారికి అభివృద్ధి పథకాల ప్రచారం, పార్టీ బలోపేతానికి దోహదపడే బాధ్యతలు అప్పగించాలని సూచించారు. సమావేశంలో బీజేపీ నాయకులు వెంకటరమణి, కందాడి నాగేశ్వర్‌రెడ్డి, రవిప్రసాద్‌గౌడ్, సాగర్, సంతప్, కొమురయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవానికి తరలిరావాలి



మాట్లాడుతున్న వెంకటస్వామి మాదిగ

**సికింద్రాబాద్:** ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు మాదిగలంతా పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇ.వెంకటస్వామిమాదిగ పిలుపునిచ్చారు. మధురానగర్ కమ్యూనిటీహాల్‌లో జిల్లా అధికార ప్రతినిధి దప్పు మల్లికార్జున్ నేతృత్వంలో బౌద్ధనగర్ డివిజన్ ఎమ్మార్పీఎస్ కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన హాజరై మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ పోరాటం వల్లే రిజర్వేషన్ల కల సాకారం అయ్యిందన్నారు. మాదిగ ఉద్యోగులు, విద్యార్థులు, యువకులు ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు టీవీ నరసింహారావు, నరేశ్, దేవేందర్, విజయరావు, మహేశ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలి

**హిమాయత్‌నగర్:** అడవుల్లోని ఖనిజ సంపదను, వనరులను కార్పొరేట్లకు దోచిపెట్టే ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయం (సత్య నారాయణ రెడ్డి భవన్)లో జరిగిన ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివాసీలపై దమనకాండను ఆపాలని, కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణను ప్రకటించి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ 23న చలో రాజ్ భవన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ వెంకటేశ్వర్లు, నానబాల రామకృష్ణ, బిజ్జ శ్రీనివాసులు, టి.సత్య ప్రసాద్, పేరబోయిన మహేందర్, శ్రీమాన్, కొండల్, రాష్ట్ర సమితి సభ్యులు ఎల్లంకి మహేశ్, ఉపేంద్ర, సల్మాన్ బేగ్, శివ కుమార్, రాజేశ్, మహమూద్, మాజీద్, మహేశ్, మధు పాల్గొన్నారు.

## లంబాడీలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలి

### సంజీవ్ నాయక్



మాట్లాడుతున్న సంజీవ్ నాయక్

**పంజగుట్ట:** లంబాడీలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని సేవాలాల్ సేనా వ్యవస్థాపకుడు సంజీవ్ నాయక్ డిమాండ్ చేశారు. లంబాడీలను నమ్మించి మోసం చేస్తున్నా మిన్నకున్నట్లు ఉన్న ఆ పార్టీ నలుగురు ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున సమావేశాలు, సభలు నిర్వహిస్తామని కాంగ్రెస్ బంజారాలకు చేస్తున్న మోసాన్ని ఎండగడతామని హెచ్చరించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే లంబాడీల వల్లే తాను అధికారంలోకి వచ్చానని చెప్పిన రేవంత్‌రెడ్డి నమ్మించి మోసం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ స్పీకర్, ఒక విప్ ఇచ్చి చేతులు దులుపుకుటాం అంటే ఊరుకునేది లేదన్నారు. వెంటనే బంజారాలకు మంత్రి పదవి, కార్పొరేషన్ చైర్మన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బాలోత్ సైదానాయక్, స్వరాజ్ నాయక్, హుస్సేన్ నాయక్, కళ్యాణ్ నాయక్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన ఈఓ



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో ఈఓ మహేందర్‌గౌడ్

**సనత్‌నగర్:** బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ఈఓగా బాధ్యతలు చేపట్టిన మహేందర్‌గౌడ్ వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో సత్కరించి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఈఓకు శుభాకాంక్షలు తెలిపారు. జులై 1న నిర్వహించే అమ్మవారి కల్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని, వారికి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయన వెంట ఆలయ ట్రస్ట్ చైర్మన్ సాయిబాబా ఉన్నారు.

**సనత్‌నగర్:** బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ఈఓగా బాధ్యతలు స్వీకరించిన మహేందర్‌గౌడ్ టీపీసీసీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కోట నీలిమాను ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా నూతన ఈఓకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

## ఘన్‌శ్యాంకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

**సనత్‌నగర్:** రాంగోపాల్‌పేట డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఘన్‌శ్యాం ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ నెక్లెస్‌రోడ్డులో గల అంబేద్కర్‌నగర్‌లోని నివాసానికి ఆదివారం వెళ్లి ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. మాజీ కార్పొరేటర్ మల్లికార్జున్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ నేతకు పరామర్శ..**

రాంగోపాల్‌పేట డివిజన్ కళాసీగూడకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత ఆంజనేయులు మాతృమూర్తి సత్యమ్మ ఇటీవల మరణించగా, ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మల్లికార్జున్‌గౌడ్, శ్రీహరి, ఆకుల హరికృష్ణ, విజయ్, చందుచారి, దేవేందర్‌చారి, నరేశ్, ఆరీఫ్ ఉన్నారు.

## ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

### ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**కాచిగూడ:** ఇష్టపడి చదివినప్పుడే విజయాలు వాటంతట అవే వస్తాయని, తద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. భావ్‌సార్ క్షత్రియ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడలోని భావసార్ భవన్‌లో విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. ఇటీవల జరిగిన వివిధ పరీక్షల్లో మెరిట్ సాధించిన భావసార్ విద్యార్థులకు ప్రోత్సాహంగా చెక్కులను అందజేశారు. విద్యకు ప్రాధాన్యతనిచ్చే సంస్థలు సమాజ అభివృద్ధికి మూలస్తంభాలుగా నిలుస్తాయని అన్నారు. కార్యక్రమంలో భావసార్ క్షత్రియ రంగ్రేజ్ సమాజ్ అధ్యక్షుడు ఉమేష్ జైతానే పాల్గొన్నారు.

## గొల్ల కురుమలకు రాజకీయ అవకాశాలు కల్పించాలి

**ఉస్మానియా యూనివర్సిటీ:** గొల్ల కురుమలకు రాజకీయాల అవకాశాలు కల్పించాలని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మన బోయిన సైదులు యాదవ్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 28 లక్షల జనాభా గల గొల్ల కురుమలకు సీఎం రేవంత్ రెడ్డి మంత్రి వర్గంలో చోటు కల్పించకపోవడం విచారకరమన్నారు. భవిష్యత్తులో అయినా పాలన పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో అవకాశాలు కల్పించాలని కోరారు.

## ఎల్లమ్మ కల్యాణ ఏర్పాట్లపై నేడు మంత్రుల సమావేశం

**అమీర్‌పేట:** బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవ ఏర్పాట్లపై ఈనెల 16న (నేడు) మంత్రులు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగే సమావేశానికి దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ హాజరవుతారని పేర్కొన్నారు. వివిధ శాఖల ప్రభుత్వాధికారులతో ఏర్పాట్లపై చర్చిస్తారని పేర్కొన్నారు.

## వీణాచారికి ఓయూ డాక్టరేట్

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ ఫిజిక్స్ విభాగం విద్యార్థి వి.వీణాచారికి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ఫిజిక్స్ విభాగం అధ్యాపకుడు డా.ఎన్‌వీ ప్రసాద్ పర్యవేక్షణలో ఎలక్ట్రికల్ అండ్ మాగ్నెటిక్ స్టడీస్ ఆన్ ఆరివిలియస్ ఫేజ్ మల్టీఫెరోయిక్ కాంపౌండ్స్ అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ లభించినట్లు తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణానికి చెందిన వీణాచారి 2017లో సీఎస్ఐఆర్–నెట్‌లో 169వ ర్యాంక్ సాధించి జేఆర్ఎఫ్ ఫెలోషిప్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. మనోపడ్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్న వీణాచారి తన పరిశోధనలో కొంత భాగాన్నియూఎస్ఏలో, హైదరాబాద్‌లోని డీఆర్ఎంఎల్, డీఆర్‌డీఓలో పూర్తి చేసినట్లు తెలిపారు. పరిశోధనలకు సహకరించిన అధ్యాపకులు, ఇతరులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్రపతి నిలయంలో ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు



**బొల్లారం:** ఫాదర్స్ డే ను పురస్కరించుకుని రాష్ట్రపతి నిలయంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ, శ్రీ జయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో తండ్రి ప్రేమ, త్యాగం, కృషి, మానవత్వాన్ని ప్రదర్శించేలా పాటలు, నాట్యాలు నాటికల ప్రదర్శనలు చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన సమాజ సేవకులు డాక్టర్ ఎస్.వి. కామేశ్వరి, డాక్టర్ సూర్యప్రకాశ్ వింజమూరిని సత్కరించారు. పలువురు కళాకారులు, వృద్ధాశ్రమాల నుంచి వచ్చిన పెద్దలు, వారి కుటుంబ సభ్యులు, స్కూల్ విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు, రోటరీ క్లబ్ సభ్యులు, సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

**రసూల్‌పురా:** సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని శాంతినికేతన్, వెస్ట్‌మారేడుపల్లి 11 కేవీ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా ఈనెల 16న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సికింద్రాబాద్ ఏడీఈ కే. మురళీకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు శాంతినికేతన్ కాలనీ, బాలంరాయి, ధనలక్ష్మీ కాలనీ, వైజయంతి కాలనీలు. అదేవిధంగా మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు వెస్ట్‌మారేడుపల్లి, బాటా, ఎంసీహెచ్ కమ్యూనిటీ హాల్, కోర్టు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించగలరని ఆయన కోరారు.

**ఈఎస్ఐ, లోధా, బేగంపేట సబ్‌స్టేషన్ల పరిధిలో..**

**సనత్‌నగర్:** ఈఎస్ఐ, లోధా, బేగంపేట సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జయభారతి స్కూల్, శ్రీరామ్‌నగర్, దాసారం బస్తీ, సీ–టైపు క్వార్టర్స్, సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియా, అల్లావుద్దీన్ కోఠి, లిక్కర్ కంపెనీ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్సార్‌నగర్ మెయిన్‌రోడ్డు ఏరియా, కమ్యూనిటీ హాల్ లేన్, ఆంధ్రాబ్యాంక్ లేన్, ఎస్‌బీహెచ్ లేన్, చైతన్య జూనియర్ కళాశాల, 2ఆర్‌టీ, 3ఆర్‌టీ క్వార్టర్స్, డీఎస్ఎంకాలనీ, అశోక్‌కాలనీ, సనత్‌నగర్ మెయిన్ రోడ్డు, సుభాష్‌నగర్, ఎస్సార్టీ పార్క్, టీవీఎస్ షోరూం లేన్, మెథడిస్ట్ చర్చి లేన్, డీమార్ట్ ఎదురు ప్రాంతం.

**ప్యారడైజ్ పరిధిలో..**

ఐఐసీటీ, లాలాగూడ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ప్యారడైజ్ సీబీడీ ఏడీఈ ఆదినారాయణరావు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు షిర్డీసాయినగర్, బ్యాంక్ ఆఫ్ బరోడా, స్ట్రీట్ నంబర్–1, సూర్యవంశీ అపార్ట్‌మెంట్. అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు సండే మార్కెట్, నాగార్జుననగర్, షిర్డీసాయినగర్, శ్రీనివాస్ అపార్ట్‌మెంట్ పార్కు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వారు పేర్కొన్నారు.

**తార్నాక సెక్షన్ డెక్కన్ ఫీడర్ పరిధిలో..**

**చిలకలగూడ:** తార్నాక సెక్షన్ డెక్కన్ ఫీడర్ పరిధిలోని షిర్డీసాయినగర్, బ్యాంకు ఆఫ్ బరోడా, తార్నాక స్ట్రీట్ నంబర్–1, సూర్యవంషైర్ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ మహేశ్‌కుమార్ తెలిపారు. అలాగే నాగార్జుననగర్ ఫీడర్ పరిధిలోని సండే మార్కెట్, నాగార్జుననగర్, సాయినగర్, శ్రీనివాస అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379